## కర్జెల్లి ఫారెస్ట్ సెక్షన్ అధికారి సస్పెన్షన్

చింతలమానేపల్లి, జూన్ 14 : మండలంలోని కర్జెల్లి రేంజ్ పరిధిలోని కర్జెల్లి సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న అజ్మీరా మోహన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఫారెస్ట్ అధికారి నీరజ్ కుమార్ ట్రిబ్రేవాల్ ఆదేశాలు జారీ చేశారు. ఖర్జెల్లి సెక్షన్లోని బండేపల్లి బీట్‌లో పెద్దసంఖ్యలో చెట్లను నరికి పోడు భూములు సాగు చేశారని, ఇందుకు రైతులకు ఖర్జెల్లి సెక్షన్ అధికారి అజ్మీరా మోహన్ సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. విధులపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం, నిబంధనలకు విరుద్ధంగా పోడు సాగుకు సహకరించడం వాస్తవమేనని తేలడంతో సెక్షన్ అధికారి మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎఫ్‌వో నీరజ్ కుమార్ ట్రిబ్రేవాల్ తెలిపారు.

## రైలు ప్రమాదంలో యువకుడి మృతి

మంచిర్యాల అర్బన్, జూన్ 14: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్ శనివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల రావీంద్రఖని రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదం జరిగిందని, మృతి చెందిన యువకుడి వయస్సు 30 నుంచి 35 ఏండ్లు ఉంటాయని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కుడి చేతిపై ఇండియా అని ఇంగ్లిష్‌లో రాసి ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధికులుంటే వివరాలకు 9701112343, 8328512176 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో..

హాజీపూర్, జూన్ 14 : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన రుద్రోజు ప్రణయ్ సాగర్ (33) లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు మహీంద్రా మినీ ట్రాలీ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట మారుతీ దాబా సమీపంలో లారీని ఓవర్ టేక్ చేసే సమయంలో అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. ట్రాలీ నడుపుతున్న ప్రణయ్ సాగర్ తీవ్రగాయాలు కాగా జిల్లా కేంద్రంలోని దవాఖానలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడన్నారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదని, మృతుడి చిన్నమ్మ కొడుకు నర్సింగోజు కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బంధన్ బ్యాంక్ పేరిట మోసం

కాగజ్‌నగర్, జూన్ 14: కాగజ్‌నగర్ లోని అశోక్ కాలనీలో ఇటీవలే బంధన్ బ్యాంక్ సిబ్బంది పేరుతో మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని అశోక్ కాలనీకు చెందిన మహిళలు గ్రూపు వారీగా బంధన్ బ్యాంక్‌లో రుణం పొందారు. రుణం పొందిన మహిళల వద్దకు వెళ్లిన కొందరు యువకులు బంధన్ బ్యాంక్ ఎత్తేస్తారని, మీ పొదుపు డబ్బులను స్థానిక బ్యాంక్ సిబ్బంది కాజేయాలని చూస్తారని, మీ డబ్బులు మీరు తీసుకోవాలని చెప్పారు. దీంతో సదరు మహిళలు తమ డబ్బులు తీసుకోడానికి రాగా, వారికి నుంచి కమీషన్ తీసుకున్నారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ బంధన్ బ్యాంక్ సిబ్బంది అశోక్ కాలనీకు చేరుకొని మోసం చేస్తున్న వారిని నిలదీసి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ స్పష్టం చేశారు.

## దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు

దండేపల్లి, జూన్14: దండేపల్లి మండలంలోని కొండాపూర్‌కు చెందిన భారతరపు సత్తవ్వపై దాడికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తహసినొద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...శనివారం సత్తవ్వ తన పెరట్లో పనిచేస్తుండగా భారతరపు కుమారస్వామి, లింగయ్య, అమృత, నాగలక్ష్మి దాడి చేశారు. సత్తవ్వ పొలంలోకి వచ్చి అక్రమంగా దున్నుతుండగా ప్రశ్నించినందుకు దాడికి పాల్పడ్డారు. చంపుతామని బెదిరించారు. గాయపడ్డవారికి లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.సత్తవ్వ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గంజాయి పట్టివేత

సీసీసీ నస్పూర్, జూన్ 14: సీసీసీ నస్పూర్ లోని విద్యానగర్‌కు చెందిన నాథరి వంశీ అనే వ్యక్తి వద్ద గంజాయి పట్టుకున్నట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్ఐ ఉపేందర్‌రావు నస్పూర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వంశీని పట్టుకుని విచారించడంతో అతని వద్ద 99 గ్రాముల గంజాయి దొరికిందని తెలిపారు. వంశీ నుంచి 99 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ మేరకు నిషేధిత గంజాయిని తరలిస్తున్న వంశీపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జన్నారం ఎఫ్‌డీవోగా రామ్మోహన్

జన్నారం, జూన్ 14 : కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ జన్నారం డివిజన్ ఎఫ్‌డీవోగా ఎం రామ్మోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్య అటవీశాఖ అధికారిణి సీ సువర్ణ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రామ్మోహన్ దూలపల్లి అటవీ శాఖ అకాడమీలో శిక్షణ కేంద్రంలో కోర్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది రేంజ్ ఆఫీసర్లకు ఎఫ్‌డీవో ఉద్యోగోన్నతులు కల్పించగా అందులో రామ్మోహన్ ఉన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శ్రీరాంపూర్, జూన్ 14 : నస్పూర్ ఏరియా 6 వార్డ్ పరిధిలోని సాయిబాబా ఆలయం నుంచి నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఏఈ అన్వర్ ప్రారంభించారు. సాయిబాబా ఆలయం నుంచి ఆర్కే 8 కాలనీకి వరకు 5 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పూదరి కుమార్, నాయకులు మహంకాళి విమల రమేశ్, ఇరుకు నాగేంద్ర, గండు మల్లయ్య, మాజీ వార్డు సభ్యులు గడ్డం శంకర్, యూత్ నాయకులు మోలుగురి మహేశ్, బొజ్జ ప్రణయ్, పంద్రాల వెంకటేశ్, పూదరి కృష్ణ, రామగిరి మల్లయ్య, రుద్రారపు ఎల్లయ్య, లక్ష్మారెడ్డి, వేముల తిరుపతి, కొండపాక రాజయ్య, ఐతే రాజమౌళి పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

హాజీపూర్, జూన్ 14 : జర్నలిస్టుల సమస్యలపై నిరంతరంగా పోరాడేది టీడబ్ల్యుజేఎఫ్ సంఘం మాత్రమేనని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి గ్రామ శివారులోని మంచిర్యాల గార్డెన్‌లో 3వ జిల్లా సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి పదహారు నెలలైనా అక్రిడేషన్ కార్డులకు ఇంకా స్టిక్కర్లను వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. హెల్త్ కార్డులు పని చేయడం లేదని, ఇండ్ల స్థలాల విషయంలో పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై జర్నలిస్టులు పోరాడాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా తొట్ల మల్లేశ్ యాదవ్, కార్యదర్శిగా చింతకింది మధుసూదన్, ఉపాధ్యక్షులుగా చుంచు చందు, అరికిల్ల జీవన్ బాబు, తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## దేవాపూర్ సిమెంట్ కంపెనీలో వైద్య శిబిరం

కాసిపేట, జూన్ 14 : కాసిపేట మండలంలోని దేవాపూర్‌లోని అదానీ గ్రూపునకు చెందిన ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్, కరీంనగర్ మెడికవర్ దవాఖాన సంయుక్తంగా దేవాపూర్ సిమెంట్ కంపెనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 65 మందికి 2డీ ఎకో, బ్లడ్ ప్రెషర్ మానిటరింగ్, ఈసీజీ, రక్త చక్కెర పరీక్ష, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ బీ. లోకేశ్ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్, డాక్టర్ నవీన్, ఉమాశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవద్దు

కాసిపేట, జూన్ 14 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలో నిర్మిస్తున్న పెద్దమ్మ గుడికి సంబంధించి ప్రహరీ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోవద్దని తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందించారు. పెద్దమ్మ గుడి 2019లో నిర్మాణం జరిగిందని, చుట్టూ ప్రహరీ లేక గుడికి రక్షణ లేదని, ప్రహరీ కట్టి గుడి పూర్తి నిర్మాణం అయ్యేంతవరకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బోయిని తిరుపతి, బీజేపీ నాయకులు దేవునూరి సంతోష్, అనిల్, బాలాజీ, పోశం, ఆలయ కమిటీ సభ్యులు రేషవేణి స్వామి, యాదవ సంఘం పెద్ద గొల్ల బోయిని రాములు, గౌరవాధ్యక్షుడు రేషవేణి మల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు రేషవేణి బాపు, మారం శ్రీపు, పుట్ట శేఖర్, బోయిని శంకర్, పుట్ట బాపు, బొడ్డ శ్రీను, వేల్పుల శ్రీను, మారం వెంకటేశ్, నలిగేటి నరేశ్, ఆవుల రాజు, వేల్పుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గని ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడికి పరామర్శ



కార్మికుడిని పరామర్శిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 14 : శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 3గనిలో ప్రమాదవశాత్తు పడి గాయపడి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న కిరణ్ కార్మికుడిని శనివారం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యులు గోపినాయక్, పిట్ సెక్రటరీ తీగల వెంకటరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ తౌటి నరేశ్ కలిసి పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ సాధుల భాస్కర్, నాయకులు బాలసాని రమేశ్, వెంగల కుమారస్వామి, జంగా తిరుపతి రెడ్డి, కుసుమ సురేశ్, ఎండీ సల్మాన్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి డైరెక్టర్ (పా)గా గౌతమ్ పొట్రు

శ్రీరాంపూర్, జూన్ 14 : సింగరేణి సంస్థలో డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా)గా నియమితులైన గౌతమ్ పొట్రు (ఐఏఎస్) శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్ బలరామ్ సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు. డైరెక్టర్ (పా)కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కే వెంకటేశ్వర్లు అదనపు బాధ్యతగా నిర్వహిస్తున్నారు. సంస్థ డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభాని, జీఎం మార్కెటింగ్ ఎస్‌వీ రాజశేఖర్‌రావు తమ అభినందనలు తెలిపారు.

## శ్రీరాంపూర్ డీవైజీఎం (పర్సనల్)గా అనిల్ కుమార్

శ్రీరాంపూర్, జూన్ 14: శ్రీరాంపూర్ ఏరియా డీవైజీఎం(పర్సనల్)గా బదిలీపై వచ్చిన ఎస్ అనిల్‌కుమార్ శనివారం జీఎం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అర్జీ-2 ఏరియా నుంచి బదిలీపై వచ్చి జీఎం ఎం శ్రీనివాస్‌కు రిపోర్ట్ చేసి బాధ్యతలు చేపట్టారు. గతంలో శ్రీరాంపూర్‌లో పీఎంగా సేవలందించి బదిలీపై వెళ్లి తిరిగి డీవైజీఎంగా వచ్చారు.

**బదిలీపై వెళ్తున్న డీవైజీఎంకు జీఎం సన్మానం**

శ్రీరాంపూర్, జూన్ 14 : శ్రీరాంపూర్ ఏరియా డీవైజీఎం(పర్సనల్)గా పని చేసి బదిలీపై వెళ్తున్న పీ అరవిందరావును శనివారం జీఎం ఎం శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూజీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం అధక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం బీభత్స, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, పీవో ఏవీ రెడ్డి, డీజీఎం రాజన్న, డీవైజీఎం ఆనంద్‌కుమార్, సర్వే ఆఫీసర్ నర్సింగారావు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

మందమర్రి, జూన్ 14: సింగరేణి మందమర్రి ఏరియాలో విధులు నిర్వహించి బదిలీ పై వెళుతున్న డీవైపీఓం సత్యబోస్, సీనియర్ పీవో విశ్రాంత్‌ను ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన వేర్వేరు కార్యక్రమాల్లో ఏరియా జీఎం దేవేందర్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం విజయ్ ప్రసాద్, కార్యాలయ సూపరింటెండ్ ఎం.రాజలింగు, డీవైపీఎం ఎండీ.ఆసిఫ్, కార్తీక్, సత్యనారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాల అర్బన్, జూన్ 14: అంతర్గాం గ్రామ శివారులోని గోదావరి నదిలో గల 8వ పిల్లర్ వద్ద (మంచిర్యాల వైపునకు) గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ శనివారం తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గోదావరిఖని ఏరియా దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతదేహం నీళ్లలో ఉండడంతో గుర్తు పట్టలేకుండా ఉందని, కుడి చేతి పై శ్రీ అని పచ్చబొట్టు ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే అంతర్గాం ఎస్ఐ 8712656527 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

# రాజీయే రాజమార్గం

- లోక్‌అదాలత్‌లో 5250 కేసులు పరిష్కారం
- మంచిర్యాల జిల్లా జడ్జి వీరయ్య



మంచిర్యాలలో లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి వీరయ్య



లక్షెట్టిపేటలో మాట్లాడుతున్న జడ్జి సాయికిరణ్

మంచిర్యాల అర్బన్, జూన్ 14 : రాజీ మార్గమే రాజ మార్గమని మంచిర్యాల జిల్లా న్యాయమూర్తి వీరయ్య అన్నారు. మంచిర్యాల జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5250 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేసులకు 8 బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజీ మార్గంతో ఇరువర్గాలు కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. 37 బ్యాంక్ రికవరీ కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు కవిత, నీరోష, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట కోర్టులో..**

లక్షెట్టిపేట, జూన్ 14: రాజీమార్గమే రాజ మార్గమని జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ అన్నారు శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు క్షణికావేశంలో చేసిన తప్పులను రాజీపడి కోర్టు కేసుల నుంచి బయటకు రావాలని సూచించారు. కోర్టు కేసులతో సమయం, డబ్బు వెచ్చించాల్సి ఉంటుందని తెలిపారు. రాజీ పడదగిన కేసులను రాజీ చేయించి కొంతమందిని కేసుల నుంచి విముక్తి కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమణమూర్తి, లక్షెట్టిపేట ఎస్ ఐ సురేశ్, జన్నారం ఎస్ఐ అనూష, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కే సత్తన్న, ఏజీపీ వేల్పుల సత్యం, మహిళా కార్యదర్శి జీ పద్మ, సీనియర్ అడ్వకేట్ రాజేశ్వరరావు, న్యాయవాదులు కక్షిదారులు, సిబ్బంది ఉన్నారు.

**చెన్నూర్ కోర్టులో**

చెన్నూర్ టౌన్, జూన్ 14 : రాజీయే రాజమార్గమని చెన్నూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పర్వతపు రవి పేర్కొన్నారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతపు రవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మొత్తం 1458 కేసులు కాగా, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు 1354, డబ్బులు రూ.6,36,420, బ్యాంక్ కేసులు 37 కాగా, డబ్బులు రూ.23, 96 813 పరిష్కారమయ్యాయి. క్రిమినల్ కేసులు 44, సివిల్ కేసులు నాలుగు రాజీ కుదిరాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి

# పోడు భూములను వదలం


- అటవీశాఖ అధికారులకు తేల్చిచెప్పిన గిరిజనులు



దిందా గ్రామంలో సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్టు అధికారులు

చింతలమానేపల్లి, జూన్ 14 : కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను వదిలేదని అటవీ అధికారులకు గిరిజనరైతులకు తేల్చిచెప్పారు. మండలంలోని దిందా గ్రామంలో అటవీ అధికారుల రీ ట్రైవ్‌ను అడ్డుకుంటూ పోడు రైతులు గ్రామ సమీపంలోని వంతెన వద్ద రైతులు టెంట్లు వేసి ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఈ టెంట్లను శుక్రవారం తీసివేశారు. రైతులు, ఫారెస్టు అధికారులు దిందా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మరోసారి సమావేశమయ్యారు. కర్జెల్లి రేంజ్ ఇన్‌చార్జి అధికారి ఇక్బాల్ మాట్లాడుతూ రైతులు పోడు భూముల విషయంలో అవసరమైన పట్టింపులకు పోకుండా సహకరించాలని కోరారు. సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. రైతులు తమ భూములు వదులుకోమని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్ని సాగు చేసుకొనివ్వాలని అధికారులను కోరారు. దీనికి అధికారులు సుముఖంగా లేకపోవడంతో చర్చ మధ్యలోనే ఆగిపోయి ఫారెస్టు అధికారులు తిరిగి వెళ్లిపోయారు. దిందా బండెపల్లికి సంబంధించి కొన్ని కంపార్ట్‌లలో మొక్కలు నాటేందుకు ఫారెస్ట్ అధికారులు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తున్నది. దిందాలో హక్కు పత్రాలు కలిగి ఉన్న గిరి రైతులు పోడు భూములు సాగు చేసుకునేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్‌తో దిందా బీట్‌లోని పోడు భూమిలో కల్టీవేషన్ చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకొని రవీంద్రనగర్‌లోని కర్జెల్లి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలుస్తున్నది.

# ఆర్కే 7 గనిని సందర్శించిన కేరళ బృందం




ఆర్కే 7గనిలోకి దిగుతున్న కేరళ ఎలక్ట్రిసిటీ అధికారుల బృందం

శ్రీరాంపూర్, జూన్ 14 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిని శనివారం కేరళ ఎలక్ట్రిసిటీ అధికారుల బృందం సందర్శించారు. కేరళ ఎలక్ట్రిసిటీ చీఫ్ ఇంజినీర్ రాజన్, అధికారుల బృందానికి ఆర్కే7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ జంగిలి తిరుపతి స్వాగతం పలికారు. అనంతరం అధికారుల బృందం గని లోపలికి దిగి పనిస్థలాలను సందర్శించారు. అక్కడున్న వాతావరణ పరిస్థితులు, ఉద్యోగులు ఏ విధంగా బొగ్గు తీస్తారు వంటి విషయాలపై పరిశీలించారు. గనిలో ఉద్యోగుల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, రక్షణ సూత్రాలు, ఎస్డీఎల్ యంత్రాల పనితీరుపై కేరళ ఎలక్ట్రిసిటి అధికారుల బృందానికి ఆర్కే7 గని ఏజెంట్ రాజేందర్, మేనేజర్ తిరుపతి వివరించారు. అనంతరం ఆర్కే7 ఏజెంట్ కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, పనితీరు, ఉద్యోగుల రక్షణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే7 గ్రూప్ ఇంజనీర్ రాజా రవిచరణ్, రక్షణ అధికారి సంతోష్‌రావు, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డ్ అధికారులు వీ లత, కే అనిత పాల్గొన్నారు.

## సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోండి

నస్పూర్, జూన్ 14 : అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మహిళ శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ తెలిపారు. తెలంగాణ దివ్యాంగుల సహాయక సమితి ద్వారా జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికీ సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తామని, జిల్లాకు 45 రెట్రోఫిట్మెంట్ స్కూటీలు, 14 బ్యాటరీ వీల్ చైర్స్, 8 మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిళ్లు , 1 బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్, 5 హైబ్రిడ్ వీల్ చైర్‌లు, 14 ల్యాప్‌టాప్స్ (డిగ్రీ విద్యార్థులకు), 7 లాప్‌ట్యాప్స్ (ఉన్నత సాంకేతిక విద్య), 22 టాబ్స్ 25జీ స్మార్ట్‌ఫోన్, 11 చేతి కర్రలు, 11 ఎంసీఎఆర్ చెప్పల్, 1 చెవిటిమిషన్, 2 చెవిటి మిషన్‌లు మంజూరయ్యాయన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 18లోగా పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు హెల్ప్ లైన్ 155326లో సంప్రదించాలన్నారు.

## బర్త్ డే కేకులో సిగరేట్ ముక్క



తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో గల ఓ స్వీట్ హౌస్ లో శుక్రవారం పుట్టిన రోజు వేడుకలకు ఓ వ్యక్తి కేక్ తీసుకొని వెళ్లాడు. కుటుంబ సభ్యులతో కలిసి దానిని కట్ చేసే సమయంలో లోపల సిగరెట్ ముక్క బయటపడింది. దీంతో కంగు తిన్న వ్యక్తి స్వీట్ హౌస్ యజమానిని ప్రశ్నించగా పట్టింపు లేని తనంతో వ్యవహరించడంతో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ఆదేశాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, సిబ్బంది శంకర్, సందీప్, వంశీతో కలిసి దుకాణంలోని అన్ని వస్తువులను తనిఖీ చేయగా ఎలాంటి పాడైన పదార్థాలు లభించలేదు. ఇప్పటికైనా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగానికి ఎంపిక



అభినవ్ వర్మ

దండేపల్లి, జూన్14: దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన పెట్టెం అభినవ్‌వర్మ అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. జోధ్‌పూర్ ఐఐటీలో ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. యూపీఎస్సీ సీఏపీఎఫ్ ఏసీ 2024 పరీక్ష ఫలితాల్లో 138 ర్యాంక్ సాధించి, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అభినవ్ వర్మను గ్రామస్తులు అభినందించారు.

# ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పెంచికల్‌పేట్, కెరమెరి ఎస్ఐలు కొమురయ్య, మధుకర్



సీపీఆర్‌పైఅవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కొమురయ్య



లక్మాపూర్‌లో యువకులకు వాలీబాల్ కిట్ అందిస్తున్న ఎస్ఐ మధుకర్

పెంచికలపేట్, జూన్ 14: వర్షాకాలం నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని ఎస్ఐ కొమురయ్య అన్నారు. శనివారం మండలంలోని ఆగరుగూడ, గుండెపల్లి గ్రామాల్లో పెద్దవాగు, ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో ఇబ్బందికి గురవుతున్న గ్రామాల్లో వరదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై, రోడ్డు భద్రత విద్యపై అవగాహన కల్పించారు. వరదల్లో చిక్కుకున్న వారికి సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు కచ్చితంగా వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని అన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

**వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి**

కెరమెరి, జూన్ 14 : ప్రజలు వర్షాకాలంలో జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దవాగు పరివాహక ప్రాంతమైన లక్మాపూర్ గ్రామాన్ని సందర్శించి అవగాహన కల్పించారు. వాగుపై వంతెన పనులు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నప్పటికీ పరిస్థితులకు అనుగుణంగా మెలగాలన్నారు. ఒక్కోసారి భారీ వర్షాలతో నీటి ప్రవాహం పెరిగినప్పుడు వాగుదాటే సాహసం చేయవద్దని సూచించారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు.

## అవినీతిరహిత పాలనకు కృషి చేయాలి

కాగజ్‌నగర్, జూన్ 14: సమాజంలో అవినీతిరహిత పాలనకు జర్నలిస్టులు కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు శనివారం పట్టణంలోని పటేల్ గార్డెన్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రెండవ మహాసభను నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ వెనుకబడ్డ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అవినీతి పాలన విచ్చలవిడిగా కొనసాగుతున్నదని, దీని నిర్మూలనకు జర్నలిస్టులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి మొదలుకొని మండల, గ్రామస్థాయి అధికారుల వరకు కూడా అవినీతి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలను సైతం కమీషన్లు అడిగే అధికారులు ఈ జిల్లాలో ఉన్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులు కూడా తమ నియోజకవర్గాలకే మంత్రులమనే ధోరణిలో ఉంటూ, ఇతర నియోజకవర్గాల అభివృద్ధిని విస్మరిస్తున్నారని అన్నారు. దీనిని బహిర్గతం చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ వందల కోట్ల అప్పులను బడా వ్యాపారవేత్తలకు మాఫీ చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల దగ్గరికి వచ్చేసరికి మాత్రం నిధులను కేటాయించకుండా వారిని అధోగతి పాలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జీ మహేశ్, పీ రాజశేఖర్, టీ సురేందర్ రావు, నీలి సతీశ్ తో పాటు జిల్లాలోని జర్నలిస్టులు పాల్గొన్నారు .

**టీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గం ఎన్నిక**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సంఘం రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య ప్రకటించారు. అధ్యక్షులుగా టీ సురేందర్ రావు ప్రధాన కార్యదర్శిగా పీ రాజశేఖర్, కోశాధికారి గా పుల్లూరి సంతోష్, ఉపాధ్యక్షులుగా విష్ణు గౌడ్, రవి, నాగేందర్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జీ.మహేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నీలి సతీశ్, సంయుక్త కార్యదర్శిగా వెంకన్న, లలిత్ లను ఎన్నుకున్నారు.

## నేడు వయోధికుల వేధింపుల నివారణ దినోత్సవం

కాగజ్‌నగర్, జూన్ 14: జూన్ 15న వయోధికుల వేధింపుల దినోత్సవం నిర్వహించి అవగాహన కల్పించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఐక్యరాజ్యసమితి 2011 డిసెంబర్ సమావేశంలో నిర్ణయించిన ప్రకారంగా ప్రతి సంవత్సరం జూన్ 15 న ప్రపంచ వయోధికుల వేధింపుల నివారణ దినోత్సవంగా ప్రపంచమంతా జరుపుకొని అవగాహన కల్పించాలని సంకల్పించింది. వయోధికుల పోషణ, రక్షణ చట్టం 2007, 2011ప్రకారం ప్రతి జిల్లా, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో కూడా ప్రభుత్వం తరపున అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యం చేయాలని డిమాండ్ చేశారు. తలిదండ్రులను సరిగా చూసుకోని పిల్లలు, కుటుంబ సభ్యులకు పైచట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్ష, రూ.10 వేల రూపాయల జరిమానా కూడా విధించే అవకాశమున్నది. యువత, పౌరసమాజం, ప్రభుత్వం అవగాహన కల్పించి తోడ్పాలని కోరారు.

## టీబీజీకేఎస్ నాయకుడికి ఘన సన్మానం



దేవేందర్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన, జూన్ 14: బెల్లంపల్లి ఏరియా ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తు టీబీజీకేఎస్ ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పని చేస్తూ శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న దేవేందర్‌ను శనివారం గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించినట్లు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తూ రామగుండం-1 ఏరియా కు బదిలీ అయిన అధికారి రెడ్డిమల్ల తిరుపతి ని గోలేటి జీఎం కార్యాలయంలో సన్మానించి ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు దారవత్ మంగీలాల్, సెంట్రల్ కమిటీ నాయకులు కార్నాథం వెంకటేశం, గజ్జెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి అలవేణి సంపత్, కార్యాలయ ఇన్‌చార్జి వంగ మహేందర్, పిట్ కార్యదర్శులు గడ్డం రవీందర్, గాజవేణి శ్రీనివాస్, పోగుల గణపతి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మంకయ్య, కమిటీ సభ్యులు విద్యాసాగర్, చిరంజివి, దుంపల బాపు, కలీముల్లాఖాన్, సప్త మల్లయ్య, తదితరులున్నారు.

## పరీక్ష ఫీజుకు ఈ నెల 16 గడువు

కాగజ్‌నగర్, జూన్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ కాగజ్‌నగర్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ నెల 16వరకు అపరాధ రుసుముతో రూ.500లతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి శనివారం తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు సెమిస్టర్-2, రెండవ సంవత్సరం సెమిస్టర్ -4, మూడవ సంవత్సరం సెమిస్టర్-6 విద్యార్థులకు జూన్, జూలై మాసాలలో జరగబోయే సెమిస్టర్ -2, సెమిస్టర్-4, సెమిస్టర్-6 అపరాధ రుసుము తోఈనెల 16 వరకు చెల్లించవచ్చని, ట్యూషన్ పీజు చెల్లించిన విద్యార్థులు మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించడానికి అర్హులని, సైన్స్ విద్యార్థులు అదనంగా ప్రాక్టికల్ ఫీజు చెల్లించాలని, యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇతర వివరాలకు సెల్ నం.9494314314, 9160144943, 9866398678 లను సంప్రదించాలని సూచించారు

## గురుకులంలో నాణ్యమైన విద్య

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 14: ప్రభుత్వ గురుకులంలో నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని స్థానిక గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ భద్రయ్య అన్నారు. శనివారం ప్రభుత్వం నుంచి వచ్చిన ఉచిత నోట్ బుక్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఆదివాసీ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక తరగతుల నిర్వహణతో గత సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించామని ఈ సంవత్సరం అదే స్ఫూర్తితో పనిచేస్తూ 100 శాతం ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు సుజాత, కృష్ణా, అధ్యాపకులు సత్యనారాయణ, తిరుపతి, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అధికారికి ఘన సన్మానం

రెబ్బెన, జూన్ 14: బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి రామగుండం-1 ఏరియాకు బదిలీపై వెళుతున్న అధికారి రెడ్డిమల్ల తిరుపతిని శనివారం గోలేటి జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా అధికారులు ఘనంగా సన్మానం చేసి మొక్కను అందించి ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజనీర్ రామనాథం, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహారా, డీజీఎం(వర్క్‌షాప్) కృష్ణమూర్తి, డీజీఎం(స్టోర్స్) శ్రీనివాసరావు, డీజీఎం(సివిల్) మదీనబాషా, ఫైనాన్స్ మేనేజర్ రవి కుమార్ లతో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు.